www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 2 ఫిబ్రవరి 2023
5
పశ్చిమ గోదావరి



స్వచ్ఛపట్టణంగా భీమవరం : గ్రంధి

భీమవరం రూరల్‌: భీమవరం పట్టణాన్ని ఇక స్వచ్ఛ భీమవరంగా తీర్చిదిద్దడానికి రూపకల్పన చేశామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్‌ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌ సహకారంతో భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. భీమవరం పట్టణం నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ప్రజలకు కూడా అతిసమీపంలో ఉందని వెల్లడించారు. జిల్లా నలుమూలల నుండి ప్రజలు నిత్యం పెద్దఎత్తున భీమవరానికి వస్తున్న నేపథ్యంలో ఈ పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. అంతేకాకుండా స్వచ్ఛ భీమవరం పట్టణంగా పట్టణ రూపురేఖలు మారుస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కులు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో మొండిచెయ్యి..!



బడ్జెట్‌లో మొండిచెయ్యి..!
'పోలవరం' ఊసే కరువు
నిట్‌కు నిధుల కేటాయింపు నిల్‌
రైల్వేలైన్లపై కొరవడిన స్పష్టత
వ్యవసాయానికి దక్కని అండ
మద్దతు ధరపై కనీస ప్రస్తావన నిల్‌
వేతన జీవులకు ఆదాయ పన్నులో ఊరట



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌ జిల్లావాసులను తీవ్ర నిరాశపర్చింది. బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్‌లో జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులుగాని, వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచే చర్యలుగాని కానరాలేదు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఊసే లేకుండాపోయింది. పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ఆమోదంపై సైతం బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు. నాబార్డు ద్వారా నిధుల కేటాయింపు జరిగినా బడ్జెట్‌లో పోలవరం గురించి ప్రస్తావించేవారు. అయితే ఈ సారి ఆ ఊసే లేకుండాపోయింది. దీంతో పోలవరం నిర్వాసితుల గురించి కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని స్పష్టంగా తెలుస్తోంది. జిల్లాలో దాదాపు 126 గ్రామాలకు చెందిన 25 వేల నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఇప్పటి వరకూ నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం, పునరావాస ప్యాకేజీ, యువతకు పరిహారం ఏ ఒక్కటీ ఇవ్వలేదు. కేంద్రం నిధులిస్తే తప్ప 45.75 కాంటూరు వరకూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రూ.30 వేల కోట్లు పనులు, పునరావాసం కోసం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతుంది. అయితే ఈ బడ్జెట్‌లో పోలవరానికి సంబంధించి నిధుల ప్రస్తావన లేకపోవడంతో మళ్లీ నిర్వాసితులు ఇబ్బందులకు గురికావాల్సివస్తున్నట్లు అర్థమవుతోంది. జిల్లాలోని కేంద్ర విద్యాసంస్థ నిట్‌కు సైతం నిధుల కేటాయింపులు ఎక్కడా కన్పించలేదు.

హైదరాబాద్‌ ఐఐటి, పెట్రోలియం యూనివర్సిటీ ఇలా కొన్ని సంస్థలకు నిధుల కేటాయింపుపై స్పష్టత ఇచ్చినప్పటికీ ఏపి నిట్‌కు సంబంధించి నిధుల కేటాయింపుపై మాత్రం బడ్జెట్‌లో పేర్కొనలేదు. రెండో ఫేజ్‌ పనులు సాగాలంటే ఈ ఏడాది దాదాపు రూ.230 కోట్లు వరకూ అవసరమని ఏపి నిట్‌ యాజమాన్యం కేంద్రానికి నివేదించింది. బడ్జెట్‌లో మాత్రం నిధుల ప్రస్తావన ఎక్కడా కన్పించలేదు.

రైల్వేలైన్లపై కొరవడిన స్పష్టత

జిల్లాలో కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు సంబంధించి నిధుల కేటాయింపుపై బడ్జెట్‌ ఎక్కడా స్పష్టత లేదు. కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్‌ మార్పు గురించి మాట్లాడని పరిస్థితి. రైల్వేకు రూ.రెండు లక్షల కోట్లకుపైగా కేటాయించినట్లు ప్రకటించడం మినహా వివరాలు మాత్రం తెలియని పరిస్థితి. దీంతో జిల్లాలోని రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు జరిగాయా లేదా అనే దానిపై అయోమయం నెలకొంది. రైల్వే అధికారులు స్పష్టత ఇస్తే తప్ప నిధులు వేటికి కేటాయించారో తెలియని పరిస్థితి. దీంతో జిల్లావాసుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.

వేతన జీవులకు ఊరట

ఆదాయపు పన్నుకు సంబంధించి వేతన జీవులకు ఊరట లభించింది. రూ.ఏడు లక్షల్లోపు ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు కల్పించారు. రూ.ఏడు లక్షలు మించి ఆదాయం దాటితే మాత్రం రూ.మూడు లక్షల వరకూ మాత్రమే పన్ను మినహాయింపు ఇచ్చింది. రూ.మూడు నుంచి రూ.ఆరు లక్షల వరకూ ఐదుశాతం పన్ను, రూ.ఆరు నుంచి రూ.తొమ్మిది లక్షల వరకూ పదిశాతం పన్ను, రూ.తొమ్మిది నుంచి రూ.12 లక్షల వరకూ 15 శాతం పన్ను, రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ 20 శాతం పన్ను, రూ.15 లక్షలపైన 30 శాతం పన్ను ఉండనుంది. ప్రస్తుత మార్పులతో జిల్లాలో పన్ను చెల్లింపుదారులైన సుమారు 90 వేల మందికి కొంత ఊరట లభించే అవకాశం ఉందని అంచనా.

వ్యవసాయానికి దక్కని అండ

జిల్లాలో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, పండిన పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోతుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నట్లు ఆర్థిక మంత్రి మాటలు చెప్పడం మినహా ఆచరణలో ఏమీ కన్పించలేదు. కనీస మద్దతు ధరకు సంబంధించి చట్టం చేయాలని రైతులు, రైతుసంఘాలు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నాయి. ఎక్కడా మద్దతు ధరపై ప్రస్తావన లేకుండాపోయింది. రైతులు ధరలేక నష్టపోతే తీసుకునే చర్యల గురించి మాట్లాడలేదు. పిఎం కిసాన్‌ సమ్మాన్‌ నిధి కింద ఏడాదికి రైతులకు కేంద్రం రూ.ఆరు వేలు ఇస్తోంది. వ్యవసాయ పెట్టుబడులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కిసాన్‌ సమ్మాన్‌ నిధి సొమ్ము పెంచాలని రైతులు కోరుతున్నారు. బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వ్యవసాయ రంగానికి, ఉపాధిహామీకి సైతం నిధులు కోతపెట్టారు. ఆక్వా రంగం అభివృద్ధికి సంబంధించి మత్స్యసంపద యోజన కింద రూ.ఆరు వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆక్వా రైతులకు అది ఏమూలకూ సరిపోని పరిస్థితి.

ధరలు పెరిగే వస్తువులు
బంగారం, ప్లాటినంతో తయారు చేసే ఆభరణాలు, సిగరెట్లు, గిల్టు నగలు, వంటగదిలో ఉపయోగించే ఎలక్ట్రిక్‌ చిమ్నీలు, సైకిళ్లు, ఆట వస్తువులు

ధరలు తగ్గే వస్తువులు
హీట్‌ కాయిల్స్‌, మొబైల్‌ భాగాలు, ల్యాప్‌టాప్‌, కెమెరా లెన్స్‌లు, టీవీ ప్యానల్‌ భాగాలు, లిథియం, అయాన్‌ బ్యాటరీలు, ఎలక్ట్రిక్‌ వాహనాలు

కొత్త విధానం ఉపయోగకరం కాదు

ఎకెవి.రామభద్రం, యుటిఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆదాయపు పన్ను పాత విధానంలో ఎటువంటి మార్పూ లేదు. నూతన విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగం లేదు. కేవలం ఆదాయ పరిమితి రూ.50 వేలకు పెంచి మేలు చేసినట్లు ప్రచారం దారుణం. కొద్దిపాటి శ్లాబులు మార్చారు.

సామాన్యులకు భారంగా కేంద్ర బడ్జెట్‌

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం



పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ కార్పొరేట్లకు అనుకూలంగానూ.. సామాన్యులకు భారంగాను ఉంది. ప్రత్యేక హోదా గూర్చిగాని, రైల్వేజోన్‌, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు, లోటు బడ్జెట్‌, పోలవరం ప్రాజెక్టుకు నిధుల గూర్చి కనీస ప్రస్తావన లేదు. నిత్యావసరాలు, పెట్రోల్‌, డీజిల్‌ ధరలు తగ్గిస్తున్నట్లు ఎక్కడా లేకపోవడం అంటే ప్రజలపై భారాలు యథావిధిగా ఉంటాయని చెప్పడమే. ఎరువుల ధరలు తగ్గిస్తున్నట్లు, మోటార్లకు మీటర్లు పెట్టబోమని, విద్యుత్‌ బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు ఎక్కడా చెప్పకపోవడం రైతాంగానికి అన్యాయం చేయడమే. ఉపాధి హామీ పనులకు నిధుల కోత దారుణం. విద్య, వైద్యానికి ఏమాత్రం బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదు. మూతపడిన పరిశ్రమలు పునరుద్ధరణ, కొత్త పరిశ్రమల స్థాపన ఊసే లేదు. ఇది యువతకు మొండిచెయ్యే. కార్పొరేట్లకు మాత్రం ఓపక్క రాయితీలు ఇస్తూ పన్నుల జోలికి మాత్రం వెళ్లలేదు. వారి ఆదాయానికి తగ్గట్టుగా పన్నులు వేయకుండా సామాన్యులు, మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన భారాలు మోపింది.

ఎగుమతులకు రాయితీలు అవసరం

కారుమూరి నరసింహారావు, అధ్యక్షులు, ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌, పాలకొల్లు



ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఎగుమతులకు రాయితీలు ఇవ్వాల్సి ఉంది. ఆర్థిక మాంద్యం ప్రభావం ఎక్కువగా ఉంది. బడ్జెట్లో ఎగుమతిదారులకు మంచి ప్రోత్సాహకాలు ఇచ్చి ఉంటే బాగుండేది. కరోనా సమయం కన్నా గతేడాదిగా ఆర్థిక మాంద్యంతో ఎగుమతిదారులు నష్టాలు చవిచూస్తున్నారు. జౌళి, నూలు పరిశ్రమదారులు తీవ్ర నష్టాల్లో ఉన్నారు.

పోలవరం ప్రస్తావన లేకపోవడం బాధాకరం


గంటా ఆనందరావు, రైతు, కాళ్లకూరు



కేంద్ర బడ్జెట్‌ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు నిధులగూర్చి కనీస ప్రస్తావన చేయకపోవడం బాధాకరం. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు పోలవరం ప్రాజెక్ట్‌ జీవనాడి. ఆక్వా రైతులకు భారంగా మారిన మేత ధరల తగ్గింపు, రైతాంగానికి సంబంధించి ఎరువుల ధర తగ్గింపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పన గురించి బడ్జెట్లో ప్రకటించకపోవడం నిరాశ కల్గించింది.

ఆక్వా రైతులకు ఒరిగిందేమీ లేదు


చేబోలు రామకృష్ణ, ఆక్వా రైతు, పెన్నాడ



విదేశీ మారకద్రవ్యాన్ని అత్యధికంగా ఆర్జించేది ఆక్వా రంగం. కేంద్ర బడ్జెట్‌ వల్ల ఆక్వా రైతులకు ఒరిగిందేమీ లేదు. ప్రస్తుతం ఆక్వా సాగు ఒడిదుడుకుల నడుమ కొట్టుమిట్టాడుతోంది. ఆక్వా సాగుకు విద్యుత్‌ సబ్సిడీ ఇవ్వట్లేదు. పండించిన పంటకు నిర్దిష్టమైన ధర లేదు. నాణ్యమైన సీడ్‌, ఫీడ్‌ మార్కెట్లో అందుబాటులో ఉండటం లేదు. ఈ అంశాలేవీ బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించలేదు.

పోలవరం ప్రాజెక్టుకు నిధులేవీ

గూడూరి వెంకటేశ్వరరావు, జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, భీమవరం



పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి రెండేళ్లవుతుంది. దీని జాప్యానికి కేంద్ర ప్రభుత్వమే ప్రధాన కారణం. జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం. ఈ అంశాన్ని అసలు ప్రస్తావించకపోవడం దారుణం. రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టిన కేంద్రం ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రత్యేక హోదా అంశాన్ని విస్మరించింది. విభజన హామీలపై ఒక్కమాట మాట్లాడలేదు. ఎనిమిదేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోంది.

ఎలక్ట్రానిక్‌ వస్తువుల ధరలు తగ్గింపు హర్షణీయం

డాక్టర్‌ డి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్‌, ఛాంబర్‌ డిగ్రీ, పీజీ కళాశాల, పాలకొల్లు



కేంద్ర బడ్జెట్లో ఎలక్ట్రానిక్‌ వస్తువుల ధరలు తగ్గించడం హర్షణీయం. దీనివల్ల సామాన్యులు వాడే సెల్‌ఫోన్లు కంప్యూటర్లు అన్ని తరగతుల వారికీ అందుబాటులో ఉంటాయి. దేశంలో ఎలక్ట్రానిక్‌ ఉత్పత్తుల ఉత్పత్తి పెరిగి ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉంది. వ్యవసాయానికి కేటాయింపులు బాగున్నాయి.

పోలవరానికి కేటాయింపుల్లేవు

ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌ఎ, తణుకు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరం. విభజన హామీల్లో ముఖ్యమైన ప్రత్యేక హోదా, రైల్వే జోన్‌ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రస్తావనే లేదు. రాష్ట్రానికి, జిల్లాకు నిధుల కేటాయింపుల్లో ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ బడ్జెట్‌ అంతగా ఉపయోగం లేదన్నారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగింది.

వ్యవసాయ రంగానికి మొండిచెయ్యి

చింతకాయల బాబూరావు, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు, భీమవరం



కేంద్ర బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధుల కోత పెట్టి మొండిచెయ్యి చూపింది. రైతాంగం కోరుతున్న విధంగా స్వామినాథన్‌ కమిషన్‌ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ఆ ధరలకు చట్టబద్ధత కల్పించడం వంటి చర్యలు ఈ బడ్జెట్‌ ప్రతిపాదనల్లో లేకపోవడం అన్యాయం. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. ఆక్వా రంగానికి అరకొర రాయితీలతో సరిపెట్టారు. ఆ రాయితీలు ఏమాత్రం సరిపోవు. సన్న, చిన్నకారు, పేద, కౌలు రైతుల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులూ లేవు. ప్రధానమంత్రి ఫసల్‌ బీమా యోజన పథకం స్థానంలో సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలి. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలి.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించిన

అధికారులపై కలెక్టర్‌ ఆగ్రహం

ఉండి: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండి, చెరుకువాడ గ్రామాల్లోని జగనన్న కాలనీల లేఅవుట్లను బుధవారం సాయంత్రం కలెక్టర్‌ పి.ప్రశాంతి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉండి పెద్దపేటలోని పుంత లేఅవుట్‌లో 261 మంది లబ్ధిదారులుండగా వారిలో కేవలం 56 మంది లబ్ధిదారులు మాత్రమే ఇంటి నిర్మాణాలను ప్రారంభించగా మిగిలిన వారు ఎందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదని అధికారులను కలెక్టర్‌ ప్రశాంతి ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని గుర్తించి వారి తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సిఎం జగన్‌ ఏర్పాటు చేసిన సచివాలయ ఉద్యోగాలు పొందిన ఇంజినీరింగ్‌ అసిస్టెంట్ల పనితీరు కూడా బాగోలేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో నలుగురు ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు ఉన్నారని కానీ వారు ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణాలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని వారి పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం అక్కడికి చేరుకున్న హై స్కూల్‌ లే అవుట్‌కు సంబంధించిన లబ్ధిదారులు కలెక్టర్‌ ప్రశాంతితో మాట్లాడుతూ తమకు కేటాయించిన లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, అక్కడికి చేరుకోవడానికి మార్గం కూడా లేదని పలువురు వాపోయారు. స్పందించిన కలెక్టర్‌ హైస్కూల్‌ లే అవుట్‌ను పరిశీలించి ఎక్కడ చూసినా నీరే ఉందని ఈ స్థలాన్ని లబ్ధిదారులకు ఇవ్వడానికి ఏ విధంగా కొనుగోలు చేశారని, ఈ విధంగా ఉన్న లేఅవుట్‌లో లబ్ధిదారులు ఏ విధంగా ఇల్లు నిర్మిస్తారని అధికారులను ప్రశ్నించారు. అక్కడికి చేరుకున్న పెద్దపేటకు చెందిన 13 మంది మహిళలు, అధికారులు తమకు స్థలాన్ని కేటాయించకుండా గతంలో ఇచ్చిన స్థలాన్ని లాక్కున్నారని ఫిర్యాదు చేశారు. వారిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా విధినిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, దీనికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. గతంలో ఈ లే అవుట్‌ పూడికకు నిధులు కేటాయించగా మళ్లీ రూ.38 లక్షలను రెండోసారి పూడికకు ఏ విధంగా కేటాయించారో అధికారులు తెలియజేయాలని ఆమె అన్నారు. హై స్కూల్‌ లే అవుట్‌కు సంబంధించిన ఫైల్‌ను తీసుకొని గురువారం ఆఫీస్‌కి వచ్చి సమాధానం చెప్పాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చెత్త సేకరణ పై అసహనం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్‌ ప్రశాంతి

గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్త తొలగింపులో అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌ పి.ప్రశాంతి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పాములపర్రు, కోలమూరు సచివాలయాలను కలెక్టర్‌ ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు. గ్రామంలోని లబ్ధిదారుల జాబితాను డిస్‌ప్లేలో ఉంచేలా శ్రద్ధ తీసుకోవాలని ఆమె కార్యదర్శికి సూచించారు. పాములపర్రు డంపింగ్‌ యార్డ్‌ను పరిశీలించారు.

సంకల్పయాత్రను విజయవంతం చేయాలి : యుటిఎఫ్‌

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయ జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్‌.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం డిమాండ్‌ చేశారు. స్థానిక యుటిఎఫ్‌ కార్యాలయంలో పాతపెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ధర్మస్థలిలో సంకల్ప యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్‌ పాదయాత్రలో ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ నెరవేర్చలేదని విమర్శించారు. పెన్షన్‌ విధానంలో గ్యారెంటీ పెన్షన్‌ విధానం అమలు చేస్తామని ప్రతిపాదించడం, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంతమాత్రమూ అమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. యుటిఎఫ్‌ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన గ్యారెంటీ పెన్షన్‌ విధానం వల్ల సిపిఎస్‌ విధానం కంటే కొద్దిపాటి ప్రయోజనాలు అదనంగా చేర్చినప్పటికీ అది ఉద్యోగ విరమణ అనంతరం భద్రత కలిగించలేమన్నారు. పాత పెన్షన్‌ విధానం పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల మూడో తేదీన యుటిఎఫ్‌ ఆధ్వర్యంలో కృష్ణ జిల్లా గన్నవరం ధర్మస్థలిలో సంకల్పదీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు పెద్దసంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ యుటిఎఫ్‌ సహాధ్యక్షులు కె.రాజశేఖర్‌, జిల్లా కార్యదర్శులు రామకృష్ణప్రసాద్‌, జి.రామకృష్ణంరాజు, ఏసుబాబు, కుమార్‌ బాబ్జీ, రామానుజరావు, నాగబాబు, శ్రీనివాస్‌, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు


4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

ఏలూరులో మూడో పిల్లల సంబరాలకు విస్తృత ఏర్పాట్లు
ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్‌ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 4, 5 తేదీల్లో ఏలూరులో హేలాపురి బాలోత్సవం పేరిట మూడో పిల్లల సంబరాలను పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి, బాలోత్సవం ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు షేక్‌ సాబ్జీ చెప్పారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరులోని సర్‌ సిఆర్‌రెడ్డి పబ్లిక్‌ స్కూల్‌ ఆవరణలో ఈ నెల నాలుగో తేదీ ఉదయం 9.30 గంటలకు హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. బాలోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. బాలోత్సవం జయప్రదానికి వివిధ కమిటీలు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామని వివరించారు. ఏలూరు నగరంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రముఖులు, పెద్దలు, వర్తక వాణిజ్యవర్గాలు, విద్యాసంస్థలు అందరూ సహకరించాలని కోరారు. రేపటి పౌరులను దేశభక్తులుగా, సామాజిక దృక్పథం కలిగినవారిగా, పర్యావరణ ప్రేమికులుగా, సేవాతత్పరులుగా మార్చేందుకు విజ్ఞానవంతమైన సమాజాన్ని నిరించేందుకు ఈ బాలోత్సవ కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. బాలోత్సవ పిల్లల సంబరాల్లో ఏలూరు నగరంతోపాటు ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ముసునూరు మండలాల్లోని 570 స్కూళ్లకు సంబంధించిన మూడో తరగతి నుండి పదో తరగతి వరకూ చదువుతున్న వేలాది మంది విద్యార్థులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 60 రకాల కల్చరల్‌, అకడమిక్‌ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తారని వివరించారు. ఏలూరు నగరంలో పెద్దఎత్తున జరుగుతున్న బాలోత్సవం మూడో పిల్లల సంబరాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్‌.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవంలో భాగంగా పాడుదమా స్వేచ్ఛా గీతం పాటను తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ లో నమోదు చేసేందుకు వెయ్యి మంది విద్యార్థులతో ఆలపించేలా నాలుగో తేదీన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే ఈ బాలోత్సవం పిల్లల సంబరాల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్‌, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. బాలోత్సవం విజయవంతం చేసేందుకు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ విద్యార్థులను ప్రోత్సహించి వివిధ పోటీల్లో వారు పాల్గొనేటట్లు చేసి సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలోత్సవం పిల్లల సంబరాల పోస్టర్లను ఆహ్వాన సంఘం కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం నాయకులు కె.శ్రీనివాస్‌, వై.ఆనందనాయుడు, ముస్తాఫ్‌ఆలీ, వి.సురేష్‌, ఎం.అజయ్‌బాబు, కె.సత్యనారాయణ, ఎబి.త్రిపురసుందరి, కట్టా సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన నేతలు




ప్రారంభమైన బస్‌షెల్టర్‌

సూర్యనారాయణరాజు సౌజన్యంతో

గరగపర్రులో బస్‌షెల్టర్‌ ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు మాజీ సర్పంచి, దాత చింతలపాటి సూర్యనారాయణరాజు సేవలు అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. గరగపర్రులో చింతలపాటి కృష్ణంరాజు, వెంకాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యనారాయణరాజు, కాంతమ్మ దంపతులు నిర్మించిన నూతన బస్‌షెల్టర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సూర్యనారాయణరాజు దంపతులను, వారి కుమారులు రమేష్‌రాజు, సురేష్‌రాజు అందిస్తున్న సేవలను అభినందించారు. అధునాతన సౌకర్యాలతో బస్టాండ్‌ నిర్మించడంతోపాటు సీసీ కెమెరాలు కూడా రక్షణగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాత చింతలపాటి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం మాజీ సర్పంచి సూర్యనారాయణరాజు దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి వీరవల్లి సత్యవతి, పంచాయతీ కార్యదర్శి కానూరి రాజేష్‌, విఆర్‌ఒ స్వామినాయుడు, స్థానిక నాయకులు చింతలపాటి బలరామరాజు, రామరాజు, శివ నాగరాజు, నరసింహరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు కోళ్లు పంపిణీ చేస్తున్న ఐకెపి ఎపిఎం రామకృష్ణ

డ్వాక్రా మహిళలకు కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

డ్వాక్రా మహిళల పురోభివృద్ధికి తక్కువ ఖర్చుతో కూడిన భువనగిరి చెందిన కడక్ నాథ్ కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఐకెపి ఎపిఎం ఎం.రామకృష్ణ అన్నారు. బుధవారం కార్యాలయం వద్ద సీసీ ఆధ్వర్యంలో 2వ యూనిట్లు డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ క్లస్టర్ వారీగా పెనుమంట్రకు 34, మార్టేరుకు 33, మామునూరుకు 33 యూనిట్లు అందజేశారు. ఒక్కో యూనిట్‌కు 15 కోళ్ల ధర రూ.3,990 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. మొత్తం మండలంలోని 1360 గ్రూపులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు టి.విజయకుమారి, కె.సుధ, వి.సత్యవతి, సిఎలు, డ్వాక్రా మహిళలు ఉన్నారు.

లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు అన్నారు. బుధవారం సీసలిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకతీతంగా ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. జనవరిలో 39 కొత్త పింఛన్లు, ప్రస్తుతం రెండు పింఛన్లు అందించమన్నారు. ఈ కార్యక్రమంలో బిల్వకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు తెరవాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రభుత్వం అన్ని పట్టణాల్లో అన్నా క్యాంటీన్లు తెరవాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కోరారు. పట్టణంలో అన్నా క్యాంటీన్ వద్ద కడలి దుర్గేష్ విశ్వనాథ్ పుట్టినరోజు సందర్భంగా తండ్రి టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కడలి గోపి పేదలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని 772వ రోజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలవలస తులసీరావు, మేడిశెట్టి కేశవ, ఫకీర్ బాబు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : సిఐ

ప్రజాశక్తి - మొగల్తూరు

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సిఐ వి.సురేష్ బాబు సూచించారు. బుధవారం మొగల్తూరులోని జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాల బారిన పడి తలకు హాని కలగకుండా హెల్మెట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ యు.రాజేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరుపై రివ్యూ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆయుష్మాన్ భారత్, ఎస్‌డిజిలపై ఎవరు తనిఖీ చేసినా తగు సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో ఎవరు ఎంత పని చేసినా గుర్తింపు ఉండదని ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఎఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్లకు ఆయుష్మాన్ భారత్, ఎస్‌డిజిపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణబాబ్జి మాట్లాడుతూ ఎవరికి వారు వారి పని తీరుపై అధికారులకు వెంటనే పంపాలన్నారు. కచ్చితంగా ఫొటోను యాప్‌లో అప్లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయం కిటకిట

ప్రజాశక్తి - ఆచంట


ఆచంటలో రథోత్సవం

ఆచంటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం యాత్రికులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు స్వామివారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, భీమలాపురం తదితర గ్రామాల్లో అంతర్వేది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచంటలో రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆర్‌బివిఎస్.రామచంద్రకుమార్, ఆలయ ఛైర్మన్ వేమనప్పారావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను బుధవారం రాష్ట్ర గుడ్ గవర్నెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడారు. వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, ఎంత సమయం పనులు చేస్తున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు ఎం.గౌరీశంకర్, సి.రవీంద్రనాథ్‌రెడ్డి పనులపై సమీక్షించారు. కార్యక్రమాల్లో ఎంపిడిఒ డాక్టర్ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.నవీన్ కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీకి వాటర్ ట్యాంకర్ బహూకరణ

ప్రజాశక్తి - ఉండి

భీమవరం మాజీ ఎంఎల్‌ఎ పెన్మెత్స వెంకట నరసింహరాజు జ్ఞాపకార్థం ఆయన భార్య సత్యవతి కుమారుడు చిన్న రామకృష్ణంరాజు యండగండి గ్రామ పంచాయతీకి 2000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకర్ బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామ శివారు ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ వాటర్ ట్యాంకర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు రెండు లక్షల రూపాయలు విలువ కలిగిన ఈ వాటర్ ట్యాంకర్‌ను పంచాయతీకి బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కెఎస్ఎస్.రామలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

కొనసాగిన గోస్తనీ నది 92వ తీర్థ ఉత్సవం

పాలకోడేరు: గోస్తనీ నది 92వ తీర్థ మహోత్సవాల వేదికగా విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పాలకోడేరు శివారు మోగల్లులో ఎఎస్ఆర్ సేవాసమితి, గోస్తనీ తీర్థ మహోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలు బుధవారం రెండో రోజు కూడా వైభవంగా కొనసాగాయి. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆజాదికా అమృత్‌లో భాగంగా మహోత్సవాల సందర్భంగా అశేష ప్రజానీకం అల్లూరి సీతారామరాజుకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేదికపై అల్లూరి జీవిత చరిత్ర నాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. అల్లూరి ముని మనవడు శ్రీరామరాజు, వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఉత్సవాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పీవీలను ఘనంగా సత్కరించారు. రాత్రి అల్లూరి సీతారామరాజు కలర్ సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ జి.కృష్ణంరాజు (బాబు) రామరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, ఉప ఎంపిపి లక్ష్మీతులసి, ఎంపిటిసి నాగలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సొసైటీల పదవీకాలం పొడిగింపు

మళ్లీ త్రిసభ్య కమిటీలకే బాధ్యతలు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో ఎన్నిక ద్వారా ఏర్పాటైన పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోగా, అప్పటి నుంచి ఎన్నికల ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత త్రిసభ్య కమిటీలను కొనసాగిస్తోంది. ప్రస్తుత కమిటీల గడువు జనవరి 31తో ముగియడంతో అవే కమిటీలను కొనసాగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 258 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 144 సహకార సంఘాలు ఉన్నాయి. 107 సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు, రెండు సహకార సంఘాల పర్సన్ ఇన్‌ఛార్జిలకు మరో ఆరు నెలల పాటు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


కాళ్లకూరు సహకార సంఘం

ఎన్నికలు నిర్వహించకుండా..

ఐదేళ్ల పదవీ కాలం ఉండే సొసైటీ పాలక వర్గాల ఎంపికకు 2013లో ఎన్నికలు నిర్వహించారు. పదవీ కాలం 2018 జనవరితో ముగియగా ఎన్నికలు జరపకుండా అప్పటి ప్రభుత్వం ఆయా పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల చొప్పున మూడు విడతలు పొడిగించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం పిఎసిఎస్‌లకు ఎన్నికలు నిర్వహిస్తుందని భావించినా దీనిని విస్మరించి ఎంఎల్‌ఎలు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సిఫార్సు చేసిన వారికి త్రిసభ్య కమిటీ సభ్యులుగా నియమించిన విషయం తెలిసిందే.

కమిటీలతో కాలయాపన..

రైతుల ప్రయోజనానికి ఉద్దేశించిన సహకార సంఘాల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల పలు గ్రామాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయి పాలకవర్గాలు లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాపోతున్నారు. త్రిసభ్య కమిటీలకు విధానపర కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోవడం, ఆరు నెలల పదవీ కాలమన్న భావనతో పిఎసిఎస్‌ల అభ్యున్నతి, రైతు ప్రయోజనాలు పట్ల పూర్తిస్థాయి దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఫలితంగా కొన్ని సహకార సంఘాల్లో అవకతవకలు చోటుచేసుకునే ఆస్కారం ఏర్పడుతోంది. ఏదేమైనా ప్రభుత్వం సహకార సంఘాల విషయంలో కమిటీలతో కాలయాపన చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే మేలన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

బివి.రాజు మున్సిపల్ పార్కును జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. నూతన జిల్లాగా ఏర్పడిన భీమవరం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పార్కుకు వచ్చే వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఎక్కడా శానిటేషన్ లోటు లేకుండా చూడాలన్నారు. విద్యుద్దీకరణ చేసి పార్కును సుందరీకరణ చేసి ప్రజలను


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. బివి.రాజు కళాశాల యాజమాన్యం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రూ.కోటీ 35 లక్షలతో బివి.రాజు పార్కును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ పార్కును ఐదు సంవత్సరాలపాటు సిఎస్ఆర్ నిధులతో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట పురపాలక సంఘం కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, విష్ణు కాలేజీ డైరెక్టర్ జె.ప్రసాదరాజు, విష్ణు ఉమెన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లను దరి చేరనీయొద్దని ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులు అమెరికాలోని ఇంగల్స్ మెమోరియల్ యూనివర్సిటీ ఆఫ్ షికాగో మెడికల్ సెంటర్ ఫ్యామిలీ మెడిసిన్ ఎమ్‌డి జి.గణపతిరాజు సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు మద్యపానం, దూమపానం వంటి మత్తు పదార్థాలకు బానిసైతే వాటి వల్ల లివర్, కిడ్నీలు చెడిపోయి జీవితం అంధకారం అవుతుందన్నారు. సాధారణ ఆహారం అలవాట్లు చేసుకోవాలని, వ్యాయామం చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటేనే భవిష్యత్తులో తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చగలరన్నారు. అనంతరం డాక్టర్ గణపతిరాజును కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి రంగరాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సహాయ ఎన్ఎస్ఎస్ అధికారి కెఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాంటిస్సోరీలో ముగిసిన క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ పాఠశాలలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న క్రీడా సంబరాలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్‌పి ఛైర్మన్ కౌరు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు కూడా అంతర్భాగమని, క్రీడల ద్వారా ఎంతో మంది క్రీడాకారులు ఖ్యాతిగాంచారని తెలిపారు. పట్టుదల, కృషి ఉంటే తప్పనిసరిగా విజయం సాధిస్తారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు మాట్లాడుతూ మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ సభ్యుడు చెల్లా ఆనందప్రకాష్, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సామవేదం వసంతలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం విజేతలు బ్లూ టీంకు బహుమతులు అందజేశారు.

నాటకరంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కోడిగట్టులోని సరస్వతి శిశు మందిర్లో రసధుని సాహితీ సభ బుధవారం జరిగింది. రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులుగా అన్నం నాగభూషణం, వర్ణినీడి నాగేశ్వరరావు, యెరుబండి విజయ భాస్కరమూర్తి హాజరయ్యారు. తాళాబత్తుల వెంకటేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. తెలుగు నాటక రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కత్తుల రామ్మోహనరావు మాట్లాడుతూ 'తెలుగు నాటక రంగం నాడు-నేడు' అనే అంశంపై ఉపన్యసించారు. సినిమా, టీవీ, సెల్‌ఫోన్ల రాకతో తెలుగు నాటక రంగానికి ఆదరణ తగ్గిందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి

ప్రజాశక్తి - భీమవరం

అర్హులైన పేదలందరికీ 90 రోజుల్లో ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసేందుకు అవసరమైన భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో గృహాలు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభం కాని లేఅవుట్లను సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు స్వయంగా తనిఖీ చేసి లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోకపోవడానికి గల కారణాల నివేదికను అందించాలని ఆదేశించారు. జిల్లాలో శ్మశానవాటికలకు అవసరమైన భూమిని సేకరించాలన్నారు. అభ్యంతరాలున్న భూములకు బదులు వేరే భూములు సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణ వేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్లు పాల్గొన్నారు.

గార్డెనింగ్ నిర్మాణంతో ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి - ఉండి

రోడ్డు క్రాసింగ్ వద్ద విద్యుత్ లైన్ల కింద గార్డెనింగ్ నిర్మాణంతో ప్రమాదాలను అరికట్టొచ్చని విద్యుత్ ఎఇ ముదునూరి మాధవరాజు తెలిపారు. ఉండి, గణపవరం రోడ్డులోని పది ఎకరాల తూము వద్ద రోడ్లపై ఉన్న క్రాసింగ్ లైన్లను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు క్రాసింగ్ పాయింట్ల వద్ద ప్రమాదవశాత్తూ వైర్లు తెగిపడినప్పుడు రోడ్లపై వెళ్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా ఈ గార్డెనింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండలంలో నాలుగు పాయింట్లను గుర్తించామని తెలిపారు. ఈ పాయింట్ల వద్ద బాగా పొడవుగా ఉన్న విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి వాటికి గార్డింగు వేయడానికి సుమారు ఒకోంక పాయింట్ వద్ద మూడు లక్షలకు పైగా ఖర్చవుతుందని తెలిపారు. ఈ గార్డెనింగ్ నిర్మాణంతో ప్రమాదాలను అరికట్టడమే కాకుండా విద్యుత్ అంతరాయాన్ని నివారించవచ్చని సూచించారు.


బాలాజీని అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బాబ్జి

కుస్తీ పోటీల్లో వీరవాసరం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - వీరవాసరం

జాతీయ కుస్తీ పోటీల్లో వీరవాసరం ఎస్ఎంబిటిఎవి అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన పాలా బాలాజీ మూడో స్థానం సాధించాడు. బుధవారం బాలాజీని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ, ప్రిన్సిపల్ వలవల నరసింహారావు అభినందించారు. బికాం రెండో సంవత్సరం చదువుతున్న బాలాజీ ఇటీవల మహారాష్ట్రలో కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయంలో జరిగిన కుస్తీ పోటీల్లో ఈ కళాశాల నుంచి ఆదికవి నన్నయ్య యూనిర్సిటీ తరుపున పాల్గొన్నాడు. బాలాజీ తమ కళాశాలకు పేరు తీసుకురావడం అభినందనీయమని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిడి చింతా సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గుంపర్రులో బుల్లెయ్య వర్ధంతి

ప్రజాశక్తి - యలమంచిలి


అంతర్వేది బుల్లెయ్య

మండలంలోని గుంపర్రు గ్రామానికి చెందిన ప్రముఖ పేదల వైద్యుడు, సిపిఎం మాజీ ఎంపిటిసి అంతర్వేది బుల్లెయ్య 20వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు గుంపర్రు సెంటర్‌లో ఉన్న బుల్లెయ్య స్మారక స్తూపం వద్ద జరగనున్న వర్ధంతి సభకు ముఖ్య వక్తగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాంతోపాటు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, సీనియర్ నాయకులు వలవల శ్రీరామ్మూర్తి, కేతా సూర్యారావు, బాతిరెడ్డి జార్జి హాజరుకారున్నారని తెలిపారు. పేదల వైద్యుడిగా పేరుపొంది తద్వారా గుంపర్రు పరిసర గ్రామాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న బుల్లెయ్య అదే స్థాయిలో గుంపర్రు, చింతదిబ్బ, కాంబొట్లపాలెం, ఇలపకుర్రు, వల్లూరు తదితర గ్రామాల్లో సిపిఎం పార్టీని విస్తరించడానికి విశేష కృషి చేశారని, అటువంటి నాయకుని 20వ వర్ధంతి సభలో నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

పోడూరు: జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మట్టపర్రు గ్రామంలో బుధవారం ఎడి జయకర్ జాన్సన్, మండల పశువైద్య అధికారి డాక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ నివారణ వ్యాధి టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 20కి పైగా కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎడి జయకర జాన్సన్ మాట్లాడుతూ ఉమండలంలోని ప్రతి పశువైద్య శాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

యాత్రికులకు పులిహోర పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పంటిరేవులో అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం ముగించుకుని వచ్చే యాత్రికులకు టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి పోత్తూరు రామరాజు ఆధ్వర్యంలో బుధవారం పులిహోర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా అంతర్వేది ప్రయాణికులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అగ్నికుల క్షత్రియ రాష్ట్ర సాధికార కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, తిరుమాని శశిదేవి పాల్గొన్నారు.

సగం సీట్లు బిసిలకు కేటాయించాలి

బిసి సంక్షేమ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

రాజకీయ పార్టీలు బిసిలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని టిడిపి, వైసిపి గత ఎన్నికల్లో సీట్లు కేటాయించకుండా అన్యాయం చేశాయని, వచ్చే ఎన్నికల్లో బిసిలకు సగం సీట్లు కేటాయించాలని జాతీయ బిసి ప్రజా సంక్షేమ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శృంగ వృక్షం మార్కెట్ యార్డులో బిసి సంక్షేమ అసోసియేషన్ మండల కమిటీ సమావేశం దొంగ కృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిసిలంతా సామాజికంగా వెనుకపడ్డారన్నారు. 1937లో బ్రిటీష్ కాలంలో బిసి జనాభా లెక్క జరిగిందని, అప్పటినుంచి వాటి ఆధారంగానే చర్చలు సాగుతున్నాయని అన్నారు. బిసి కులాలంతా ఒక తాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో బిసి కులాల గణన వెంటనే చేపట్టాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రయివేటురంగంలోనూ రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా చేబోలు రామకృష్ణ, బోరాబత్తుల సత్యనారాయణ, గుంటపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా దొమ్మేటి వేణుగోపాలం, ఉపాధ్యక్షులుగా నేతల గోపి, ప్రధాన కార్యదర్శిగా చేబోలు రమేష్, కార్యదర్శిగా దేవా సత్యనారాయణ, కార్యనిర్వహణ కార్యదర్శులుగా గులిపల్లి వెంకట పాండురంగారావు, వనమరాజు, నందం సత్యనారాయణ, కోశాధికారిగా పాలా శ్రీధర్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పెన్నాడ సర్పంచి అనూష సత్యనారాయణ, రంగారావు, పెంటయ్య, చింతాడ శ్రీనివాస్ మహేంద్ర పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సొంతిల్లు కలిగి ఉండాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సొంతిల్లు కలిగి ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం వీరవాసరం మండలం మత్స్యపురిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కమతంపల్లికి చెందిన కందులపాటి రాంబాబు, కొంతట్ల సుధాకర్, బందెల రూన్నీ, బందెల పుష్పకు ఎంఎల్‌ఎ ఎంజాయ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో జగన్ అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి, పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులు సొంతింటి కలను నిజం చేసుకోవాలని తెలిపారు. భీమవరం నియోజకవర్గంలో దాదాపు 15 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణ విషయంలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం తహశీల్దార్ ఎం.సుందర్‌రాజు, పార్టీ నాయకులు తోట భోగయ్య, చెల్లబోయిన సూర్యప్రకాష్ పాల్గొన్నారు.